

# ఇలాగే జరుగుతుంటుంది

మల్లాది వెంకట కృష్ణమూర్తి

"చాలా అర్జెంట్ అండి. వందరూపాయలు కావాలి మా పెద్దమ్మాయికి పరీక్ష ఫీజ్ కట్టాలి. ఇవాళే ఆఖరిరోజు. ఫైన్‌తో కూడా కట్టడానికి" చేతులు నలుపుకుంటూ అడిగాడు గోపీచంద్ తన మిత్రుడిని.

గోపీచంద్ మిత్రుడు వెనక్కి తిరిగి సికింద్రాబాద్ స్టేషన్‌క్లాక్ టవర్‌వైపు చూసాడు. ఉదయం తొమ్మిదిన్నర

"సారీ అండి నా దగ్గర నెలాఖరులో అంత డబ్బు వుండదు" అన్నాడు నొచ్చుకున్నట్లుగా.

గోపీచంద్ మొహంలో బాధ క్షణకాలం నాట్యంచేసింది. మొహంమీది భావం గోపీచంద్ మాటల్లోకి దొర్లింది-బాధ

"ఏడాది చదువూ వృధా అవుతుంది రెండురోజులనుంచి అనేకమంది దగ్గర ప్రయత్నిస్తున్నాను. నెలాఖరు కాబట్టి దొరకలేదు"

గోపీచంద్ మిత్రుడు మౌనంగా వుండిపోయాడు

"ప్చ్ : ప్రాప్తం వుంటే పరీక్ష కెళ్తుంది బేంక్‌లో చలాన్ కట్టడానికి

అట్టే సమయం కూడా లేదు ఆఫీస్‌లో ప్రయత్నించినా దొరకదు "

కండక్టర్ 'టికెట్ ప్లీజ్' అన్నాడు.

"పాస్" అన్నాడు గోపీచంద్ నలభై రెండో నంబర్ బస్ స్టాప్‌లో, గోపీచంద్ ముందు నిలబడివున్న అతని మిత్రుడు అర్ధరూపాయ బిళ్ళ కండక్టర్‌కి పర్స్‌లోంచి తీసిచ్చి 'లిబర్టీ' అన్నాడు

గోపీచంద్ ఆలోచనలో పడ్డాడు. నలభై రెండో నంబర్ బస్ వచ్చింది సింగిల్ డెకర్. ఎక్స్‌ప్రెస్ బస్ అది గోపీచంద్ దిగాల్సిన స్టాప్‌లో ఆగదది.

గోపీచంద్ మిత్రుడు ఆ బస్ ఎక్కాడు, క్యూలోంచి బయటకి వచ్చి, గోపీచంద్‌కి మరోసారి తన 'సారీ' ని చెప్పి

బస్‌లో ఎక్కి కూర్చుని అనుకున్నాడు గోపీచంద్ మిత్రుడు. 'వందేగా ? డిగి ఇస్తే '

మళ్ళీ వెంటనే అనుకున్నాడు 'నా దగ్గరున్నదే నాలుగొందలు జాక్‌పాట్ ఆడటానికి ఎంతైనా చాలదు ఆ వంద వీడికి ఇచ్చేస్తే పది కాంబినేషన్స్ మిస్ అవుతాను నా అదృష్టం ఎలా వుందో, ఏమిటో? ఇవ్వను

మళ్ళీ అనిపించింది 'వెధవ రేసులకి తగలేసే బదులు వంద సర్దుబాటు చేస్తే, సంవత్సరం చదువు వృధా కాకుండా వుంటుంది.'

కాని గోపీచంద్ మిత్రుడికి మనసు వప్పలేదు, వందరూపాయలు అప్పు ఇవ్వడానికి ఎటూ నిర్ణయించుకోలేక పోయాడు ఇంతలో బస్ కదిలింది

'ఇంకెక్కడయినా సంపాదించుకుంటాడులే' అనుకున్నాడు

లిబర్టీ బస్‌స్టాప్ దగ్గర దిగాడు గోపీచంద్ మిత్రుడు

జేబు వెలితిగా వుందనిపించి, అనుమానంగా కుడిచేతివైపున్న పేంట్ జేబులోకి పోనిచ్చాడు చేతిని

జేబు ఖాళీగా వుంది !

* * *

గోపీచంద్ డబల్ డెకర్ బస్ ఎక్కి, తను దిగాల్సిన స్టాప్‌లో దిగాడు పడీ పడికి సరాసరి ఆఫీస్‌కి వెళ్ళకుండా ఆఫీస్ దగ్గరేవున్న ఓ మనీ లెండర్ షాప్‌కి వెళ్ళాడు

అయిష్టంగానే తన వుంగరాన్ని ఆ షాప్‌లోని మార్వాడీకి తాకట్టు పెట్టి, నూట పాతిక తీసుకున్నాడు ఆఫీస్‌కెళ్ళి, అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం చేసి, ఆఫీసర్ దగ్గర అరగంట పర్మిషన్ తీసుకున్నాడు గోపీచంద్

బేంక్‌కి వెళ్ళి, చలాన్‌కట్టి ఆఫీసుకి బస్‌లో వచ్చాడు ముప్పావుగంట తర్వాత పదకొండున్నరకి కాఫీ వచ్చింది కాఫీ తాగి, డబ్బివ్వాలని పర్స్‌కోసం జేబులో చెయ్యిపెట్టాడు గోపీచంద్.

గుండె ఝల్లుమంది ! జేబు ఖాళీగా వుంది !!

దాదాపుగా ఏడుపు వచ్చినంత పని యింది గోపీచంద్‌కి. బేంక్‌లో డబ్బు కట్టాక బయటకి వచ్చి, ఓ ఇరానీ రెస్టారెంట్‌లో టీ తాగాడు అప్పటి దాకా వుంది పర్స్ జేబులోనే బహుశ బస్‌లో ఎవరో కొట్టేసి వుంటారు. లేదా అది బస్‌లో తన జేబులోంచి జారిపోయి వుంటుంది తనకి తెలియకుండా.

పాతిక రూపాయల పైన కొంత చిల్లర వుంది దాన్లో ఆ డబ్బు పోయినందుకు ఎంత బాధపడ్డాడో, ఆ డబ్బున్న పర్స్ పోయినందుకు కూడా అంత బాధపడ్డాడు

క్రిందటి వేళ ఆఫీస్ పనిమీద ఢిల్లీ వెళ్ళినప్పుడు కొన్నాడా పర్స్‌ని, ఎంతో ముచ్చటపడి. నోట్లు, చిల్లర, ఫోటో కాగితాలు, విజిటింగ్ కార్డ్ మొదలయినవి పెట్టుకోడానికి అనువుగా వుందా పర్స్. పర్స్‌మీద అందంగా తాజ్‌మహల్ బొమ్మ కూడా వుంది

ఎవరైనా కొట్టేసి వుంటే, ఇక అది తిరిగి దొరకదు జేబులోంచి జారి పోయి వుంటే, ఎవరైనా మంచి వాళ్ళ కళ్ళబడివుంటే, తిరిగి దొరకచ్చని ఆశించాడు. ఆ పర్స్‌లో తన ఆఫీస్ ఎడ్రసు, టెలిఫోన్ నంబర్ వున్నాయి.

మర్నాడు మధ్యాహ్నందాకా ఫోన్ చేయలేదు ఎవరూ, పర్స్ దొరికినట్లుగా ఇక అది తనకి దొరకటం దుర్లభం అనుకున్నాడు గోపీచంద్

"పోన్లెండి ఆ వందయినా మిగిలింది పిల్ల చదువు వృధా కాలేదు." అన్నది గోపీచంద్ భార్య అనునయంగా

కాని గోపీచంద్ ఎదురు చూడని సంఘటన ఒకటి మర్నాడు రాత్రి జరిగింది.

* * *

మర్నాడు రాత్రి గోపీచంద్ అద్దెకుంటున్న ఇంటాయన గోపీచంద్ ఇంటికి వచ్చాడు

"మీ పర్స్ పోయిందనుకుంటాను?" అడిగాడు

అవునన్నట్లుగా తలూపాడు గోపీచంద్ విస్మయంగా

"ఇంత అజాగ్రత్తయితే ఎలా? వందా, రెండు వందలా? నాలుగు వందల చిల్లర" అన్నాడు

గోపీచంద్ అయోమయంగా చూసాడు ఆయనవంక

"మా అమ్మాయికి దొరికింది కాబట్టి సరిపోయింది మరెవరి కళ్ళబడ్డా దొరికేదికాదు. మీ అదృష్టం బావుందీరోజు"

అతడు పర్స్ తీసి గోపీచంద్ చేతిలో వుంచాడాయన.

"ఎక్కడ దొరికింది ?" ఆత్రంగా అడిగాడు గోపీచంద్.

"నాంపల్లి బస్ స్టాండులో నేలమీద పడివుంటే, మా రెండో అమ్మాయి కాలేజీనుంచి వస్తూ చూసింది నిన్న రాత్రి నాకిచ్చింది దొరికిందని. దీంట్లో మీ ఫోటో, చిరునామా, కాగితాలు చూసి మీరని గుర్తుపట్టాను ఇక నుంచయినా జాగ్రత్తగా వుండండి" మందలింపు ధోరణిలో అన్నాడు ఆ మంచివాడు.

గోపీచంద్ సతీమణి ఇచ్చిన కాఫీ తాగి వెళ్ళిపోయాడాయన

గోపీచంద్ పర్స్ తెరచి చూసాడు నిజంగా,తనదే అది పాతిక రూపాయల చిల్లర వుండటానికి బదులు, నాలుగు వందల పాతిక రూపాయల చిల్లర వుంది ! అంటే నాలుగు వందలు— నాలుగు కొత్త వంద రూపాయల నోట్లు ఎక్కువ వున్నాయి !!

"ఈ డబ్బెక్కడిది ?" అడిగింది గోపీచంద్ కూతురు సంభ్రమంగా.

"నాకు తెలియదు ఎవరిదో అయి వుండాలి" అన్నాడు.

కొన్ని క్షణాలాగి అన్నాడు ఆలోచించి.

"ఇప్పుడు తెలిసింది బస్‌లో నా పర్స్ ఎవరో కొట్టేసి వుంటాడు. బహుశ ఇంకెవరి పర్స్ అయినా కూడా కొట్టేసి, ఆ పర్స్‌లోని నాలుగువందలు నా పర్స్‌లో వుంచి వుంటాడు నా పర్స్ ముచ్చటగా వుంది కాబట్టి దీన్ని పారేసి వుండడు ఆ జేబుదొంగ దురదృష్ట వశాత్తు ఆ పర్స్ నాంపల్లి బస్ స్టాప్‌లో అతని జేబులోంచి జారిపోయి నేలమీద పడిపోయి వుంటుంది అది సరిగ్గా మన ఇంటాయన కూతురు కళ్ళబడి మనకి చేరింది "

"అవును అలాగే జరిగి వుంటుంది. మీ ఫోటో, కాగితాలు పర్స్‌లోంచి తీసి పారేయలేదా దొంగ ఎందుకనో" అన్నది గోపీచంద్ భార్య.

"ఇలాగే జరిగి వుంటుంది. అదృష్టం మన పక్షం వుంది కాబట్టే" అన్నాడు గోపీచంద్ ఆనందంగా నవ్వుతూ.

